మంగళ వారం
25-04-2023
సంపుటి - 08,
సంచిక - 304
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole


# పోలీసులపై దాడి షర్మిల అరెస్టు

14 రోజుల జుడీషియల్ రిమాండ్ ● చంచల్‌గూడ జైలుకు తరలింపు



- విధుల్లో ఉన్న పోలీసులపై చేయిచేసుకున్న షర్మిల
- అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- స్టేషన్ వద్ద హంగామా చేసిన విజయమ్మ
- పోలీసులపై షర్మిల దురుసు ప్రవర్తన
- అడ్డుకోవడానికి వచ్చిన పోలీసులపై చేయి
- ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- షర్మిల సిట్ ఆఫీస్‌కు వెళితే అడ్డుకుంటారా
- పోలీసుల తీరుపై తల్లి విజయమ్మ అభ్యంతరం
- అరెస్టుపై కోర్టుకు వెళతామని వెల్లడి
- షర్మిల సిట్ ఆఫీస్‌కు వెళితే అడ్డుకుంటారా
- అరెస్టుపై కోర్టుకు వెళతామని వెల్లడి



పోలీసుల తీరుపై తల్లి విజయమ్మ అభ్యంతరం

**హైదరాబాద్,ఏప్రిల్24(సమ సమాజం):** లోటస్ పాండ్ లోని వైఎస్ షర్మిల ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో సిట్ అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చేందకు బయలు దేరిన ఆమెను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. షర్మిల కారు ఎక్కే సమయంలో అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీస్‌పై షర్మిల చేయి చేసుకున్నారు. పోలీసులపై దుర్భాషలాడారు. వారిపై దురుసుగా ప్రవర్తించారు. ఈ క్రమంలో షర్మిలకు పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు అడ్డుకోవడంతో షర్మిల రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజ్ వ్యవహారంలో సోమవారం సిట్ అధికారులకు మెమొరాండం

3వ పేజీలో...

# మన రాతను మనమే మార్చుకుందాం

మీ ఓటుతో మీరే ప్రభుత్వం ఏర్పాటు చేయాలి



బిఆర్ఎస్‌కు ఓటేస్తే తెలంగాణ పథకాల అమలు

రైతులు ఆత్మహత్యలుచేసుకోవద్దు


రైతు సర్కార్‌ను తెచ్చుకుందాం రండి

ఔరంగాబాద్ వేదికగా బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పిలుపు

3వ పేజీలో...

## బిజెపి ఎజెండాలో ముస్లిం రిజర్వేషన్ల ఎత్తివేత

తుట్టెను కదిపిన కేంద్రమంత్రి అమిత్ షా



**హైదరాబాద్, ఏప్రిల్ 24 (సమ సమాజం):** చేవెళ్ల సభ వేదికగా కేంద్రమంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని అన్నారు. వాటిని ఎస్సీ,ఎస్టీ, బీసీలకు కేటాయిస్తామని చెప్పారు. కర్నాటకలోనూ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. ఇది బిజెపికి మైలేజీ వచ్చేలా ఉందా లేదా అన్నది పక్కన పెడితే.ముస్లిం రిజర్వేషన్ విషయంలో బిజెపి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. దీంతో హిందుత్వ ఓట్లను పదిలపర్చుకునే ప్రయత్నాల్లో ఉందన్నది సుస్పష్టం. ఒవైసీ అజెండాపై సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్న అమిత్ షా.. కారు స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉందని విమర్శించారు. మజ్లిస్ అంటే తమకు భయం లేదని చెప్పారు. కాంగ్రెస్ తో

3వ పేజీలో...

## పోలీసులపై షర్మిల దురుసు ప్రవర్తన



**హైదరాబాద్,ఏప్రిల్ 24 (సమ సమాజం):** చట్టవిరుద్ధంగా పోలీసులపై వైఎస్ షర్మిల దాడిని పోలీసులు శాఖ సీరియస్‌గా తీసుకుంది. ఎస్సై రవీందర్ ఫిర్యాదు మేరకు షర్మిలపై 353, 330 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. టీఎస్పీఎస్పీ పేపర్ లీకేజ్ కేసులో సిట్ అధికారును కలిసేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చిన వైఎస్ షర్మిలను పోలీసులు అడ్డుకున్నారు. కారులో వెళ్లేందుకు యత్నించగా...కారును చుట్టుముట్టిన పోలీసులు.. ఆమె వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన షర్మిల.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులను నెట్టేస్తూ ముందుకు సాగేందుకు యత్నించారు. ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌ను ముందుకు తోసేశారు. అయినా షర్మిలను మహిళా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఆమె రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. షర్మిల పోలీసులపై దాడి చేసినట్లు తెలిసిందని డీసీపీ జోయల్ డేవిస్ తెలిపారు. పర్మిషన్ లేకుండా

3వ పేజీలో...

# గవర్నర్ కేసు .. సుప్రీంలో ముగింపు

పెండింగ్ బిల్లులు లేవన్న గవర్నర్ లాయర్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (సమ సమాజం):** తెలంగాణ గవర్నర్ పెండింగ్ బిల్లుల కేసులో ప్రభుత్వం వేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. వివరణ కోసం గవర్నర్ కు బిల్లులు తిప్పి పంపే అధికారం ఉందన్న సుప్రీం కోర్టు .. వీలైనంత త్వరగా బిల్లులపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. ప్రస్తుతానికి బిల్లులు పెండింగ్ లో లేనందున ఈ కేసును ముగిస్తున్నట్లు తెలిపింది. విచారణ సందర్భంగా గవర్నర్ దగ్గర ఎటువంటి



3వ పేజీలో...

## భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే



ఆర్టీసీలో, ప్రైవేట్ రంగంలో ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహం

మహీంద్రా ఎలక్ట్రిక్ వాహనాల యూనిట్‌కు కెటిఆర్ శంకుస్థాపన

**సంగారెడ్డి, ఏప్రిల్ 24 (సమ సమాజం):** భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్టీసీలో, ప్రైవేట్ వెహికల్స్ రంగంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ మొబిలిటీ వాలీ ద్వారా ఎలక్ట్రిక్ తయారీ

3వ పేజీలో...

## సంపాదకీయం

# అధికారం సరే..ఏం చేశారో చెప్పండి !

కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బిజెపి..మరోమారు అధికారం కోసం ప్రయత్నించడంలో తప్పు లేదు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మళ్లీ అధికారంలోకి రావాలనుకోవడంలోనూ తప్పులేదు. అలాగే కొత్తగా తెలంగాణ,ఎపిల్లోనూ అధికారం కావాలని ప్రయత్నించడంలోనూ తప్పులేదు. దేశం అంతా తమ ఏలుబడిలో ఉండాలని కోరుకోవడంలోనూ తప్పు లేదు. అయితే అధికారం ఎందుకోసం..ఎవరికోసం.. అన్న ప్రశ్నలు వేసుకోవాలి. కేవలం మోడీని మోయడానికే అధికారమా..లేక ప్రజలకు మేలు చేయడానికా అన్న ప్రశ్నలు బిజెపి నేతలు వేసుకోవాలి. దేశానికి సేవచేసే క్రమంలో ఎంతవరకు సక్సెస్ అయ్యరో చెప్పాలి. పార్లమెంటులో సమస్యలకు సమాధానం చెప్పలేని వాళ్లు..సమస్యలపై చర్చించలేని వారు ప్రజలకు ఏ మేరకు సేవ చేశారని ఎలా చెప్పగలం. పార్లమెంటులో ఏదైనా అంశంపై చర్చకు పట్టుబట్టినా బిగుసుకుని కూర్చుండే నేతలు అవసరమా.. అన్నదే ఇక్కడ ముఖ్యం. అలాగే ప్రజలకు ఏం చేశామన్నదే ప్రాతిపదిక కావాలి. ప్రజలకు మంచి చేసేందుకు ఎవరు ముందుకు వచ్చినా మంచిదే...ఆ పని బిజెపి చేస్తుందనుకుంటే ప్రజలు తప్పకుండా బిజెపినే ఆదరిస్తారు. కానీ ఎదుటి పార్టీలను నిందించడం ద్వారా అధికారంలోకి రావడం అన్నది అసంభవం. కర్నాటకలో ఏం చేశారో..గుజరాత్‌లో ఏం చేశారో..మధ్య ప్రదేశ్‌లో ఏం చేశారో చెప్ప గలగాలి. తెలంగాణలో అధికారంలోకి రావాలనుకుంటున్న బిజెపి..తెలంగాణతో పాటు ఇతర బిజెపి పాలిత రాష్ట్రాల పాలనతో పోల్చాలి. అక్కడికన్నా ఎక్కువ ఏం చేశారో లేదా అభివృద్ది జరిగిందా అన్నది చెప్పగల గాలి. కానీ బిజెపి నేతలు అలా చెప్పడం లేదు. ఎందుకంటే చెప్పుకోవడానికి ఏమీ లేదు కనుక చెప్పడం లేదు. ఎంతసేపు తెలంగాణలో కెసిఆర్‌ను, బిఆర్‌ఎస్‌ను విమర్శించడం..కేంద్రంలో కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టించడం.. తప్ప మరోటి చేయడం లేదు. ఈ దృష్టిని ప్రజా సంక్షేమంపై సారించివుంటే బిజెపికి తిరుగు ఉండేది కాదు. కానీ చేతకాని తనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నాల్లో మోడీ, అమిత్ షాలు పోటీ పడుతు న్నారు. చేవెళ్లలో నిర్వహించిన బహిరంగసభలో అమిత్‌షా మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారం తమదేనని ప్రకటించారు. కెసిఆర్ అవినీతి, అక్రమాలు వేరు. అభివృద్ది వేరు. ఏ రాష్ట్రంతో పోల్చినా తెలంగాణ ఎంతో పురోగమిం చింది.అవినీతి ఉంటే నిలదీయండి. కెసిఆర్ అవినీతిని రుజువు చేయాలి. హెచ్చరికలు, ఆరోపణ లతో లబ్దిపొందడం కాదు. లిక్కర్ కేసులో ఏడాదిగా చేసిందేమీ లేదు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా దర్యాప్తు సాగుతోంది. అందుకే తెలంగాణకు లేదా ఎపికి ఏం చేశారో చెప్పాలి. సవాళ్లకు జవాబు ఇవ్వాలి. తెలంగాణకు ఏదో చేశామంటే నమ్మేవాళ్లు ఎవరని వస్తున్న ప్రశ్నిస్తున్న వారికి సమాధానం చెప్పాలి. బయ్యారం ఉక్కు అతీగతీ లేదు. విబ.జన హామీలు అమలు కానేకాలేదు. ÷ూష్ట్రానికి మెగా టెక్స్టైల్ పార్క్ మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కొన్నేండ్లుగా కేంద్రాన్ని కోరుతున్నా పట్టించు కోకవడం లేదు. వరంగల్‌లో సొంతంగా కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌ను ఏర్పాటును ప్రభుత్వమే చేసింది. దీనికి నిధులు మంజూరు చేయాలని కోరినా ఇవ్వలేదు. రాష్ట్రంలో జాతీయ రహదారుల కోసం రూ.లక్ష కోట్లు మంజూరు చేశామని అమిత్‌షా గొప్పగా చెప్పుకున్నారు. కానీ ఇప్పటివరకు కేటాయింపులు రూ.30 వేల కోట్లు కూడా దాటలేదు. అయినా వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని అమిత్‌షా భ్రాంతిని కలిగించే ప్రయత్నం చేశారు. ప్రధాని కావాలని సీఎం కేసీఆర్ అనుకుంటున్నారు. కానీ కేంద్రంలో పీఎం సీటు ఖాళీగా లేదని అమిత్ షా వ్యాఖ్యానించారు. ప్రధాని పదవి ప్రజలు పెట్టిన భిక్ష. ఎవరు ఉండాలో వద్దో ప్రజలు తేలుస్తారు. అందుకే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ..తొమ్మిదేండ్లలోనే దేశానికి తెలంగాణను ఆదర్శంగా నిలిపిన సీఎం కేసీఆర్..ఇక్కడ పాతుకుపోయారు. ఎవరైనా తమకు అధికారం

కావాలనుకుంటే ప్రజల మనసులు గెలిచేలా ఇంత వరకు ఏం చేశామో చెబుతారు. లేదా ఒక వేళ అధికారం ఇస్తే ఎలాంటి అభివృద్ధి చేస్తామో వివరిస్తారు.కానీ అమిత్‌షా, బీజేపీ నేతలు మాత్రం ప్రజల్లో విద్వేష పెంచేందుకు, భ్రమలు కల్పించేం దుకు మాత్రమే పరిమితం అయ్యారు. అవినీతి గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా బిజెపి నేతల ఆరోపణలు ఉన్నాయి. ÷ూష్ట్రంలో అవినీతి ప్రవహిస్తున్న దని నోరుపారేసుకున్నారు. నిజానికి అవినీతి ఉంటే నిగ్గు తేల్చాలి. తమ చేతుల్లో ఉన్న కేంద్ర దర్యాప్తు సంస్థలతో నిజాయితీగా విచారణ చేయించాలి. అవినీతి ఎక్కడ..ఏ రూపంలో ఉన్నా విచారణ జరగాల్సిందే. నిజాయితీగా దీనికి పూనుకోవాలి. అక్రమార్కులను చీల్చి చెండాడాలి. అంతేగానీ కేవలం విపక్ష పార్టీల అవినతిని ఎత్తిచూపుతూ..తమ పార్టీకి చెందిన వారి అవినీతి గురించి మాట్లాడకపోవడం కూడా అవినీతి కిందే లెక్కకట్టాలి. ఇకపోతే ప్రజలంతా మన ప్రజాస్వామ్యం సక్రమంగా మనుగడ సాగిస్తున్నదా లేదా అన్న ఆలోచన చేయాలి.పాలకులు నిజాయితీ గా ఉంటున్నారా లేదా అన్న ఆలోచన చేయాలి. ఓట్లను అమ్ముకోవడంతో వారు మన నెత్తిన ఎక్కి కూర్చుం టున్నారు. అధికారం దక్కగానే వారు తీసుకునే నిర్ణయాలకు మనం బలవుతున్నాం. వారు విదిల్చే తాయిలా లకు లొంగడం వల్ల మనలను అమాయకులను చేసి ఆడిస్తున్నారు. ఇవన్నీ ప్రజలుగా ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ఓటేసే ముందు..వేసిన తరవాతా నేతల తీరు గురించి ఆలోచించాలి. వారి కుట్రలకు ప్రజలు బలిపశువులు కాకూడదు. 75 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం కూడా ఇంకా ప్రజలు అనేక రకాల కష్టనష్టాలు భరిస్తున్నారు. పాలకుల మాత్రం సర్వసుఖాలు అనుభవి స్తున్నారు. ఇందుకు బిజెపి పాలకులు కూడా ఏమాత్రం తీసిపోవడం లేదు. ఈ క్రమంలో బిజెపి ఆత్మవిమర్శ చేసుకుని ప్రజలకు ఏ రకంగా మేలు చేస్తున్నామో ప్రకటించాలి. ఎక్కడ మేలు జరిగిందో చెప్పాలి. అప్పుడే అమిత్ షా గానీ, మోడీగానీ చెప్పే మాటలకు విలువ ఉంటుంది.


# దేశాన్ని నడుపుతున్నది పెట్టుబడిదారులే

### మోడీ, అమిత్‌షాలు సూత్రధారులే: జగదీశ్ రెడ్డి



**భువనగిరి,ఏప్రిల్ 24 (సమ సమాజం):** ప్రజల మధ్య చిచ్చుపెట్టి విభజన తీసుకొచ్చి రాజకీయ ప్రయోజనం పొందాలని బీజేపీచూస్తున్నదని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. భారతదేశాన్ని నడుపుతున్నది ప్రధాని మోదీ , అమిత్ షాలు కాదని, ఒకరిద్దరు పెట్టుబడిదారులు మాత్రమేనని విమర్శించారు. వారి స్వార్థప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని ఫణంగా పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో 'మన ఉత్పత్తులు–మన గౌరవం' భవనాన్ని మంత్రి జగదీశ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డపై బీజేపీ ఆటలను ప్రజలు సాగనివ్వరని చెప్పారు. దేశంలో 35 శాతం మంది ప్రజలు తినడానికి తిండి లేకుండా ఉన్నారని.. దీనికి ప్రధాని మోదీ సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. బీజేపీ వల్ల దేశం 30 ఏండ్లు వెనక్కి పోయిందని విమర్శించారు. ప్రపంచం ముందు దేశ పరువు తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఆ పార్టీకి ఉన్న మూడు సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. ప్రజలు బీజేపీ డిపాజిట్లు గల్లంతు చేస్తారని వెల్లడించారు. తెలంగాణలో కమలం పార్టీ పప్పులు ఉడకవని, ఇక్కడున్నది మహా నేత సీఎం కేసీఆర్ అని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు.


# టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్‌పై హైకోర్టులో విచారణ



**హైదరాబాద్, ఏప్రిల్ 24 (సమ సమాజం):** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్‌పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ కేసును సీబీఐకి ఇవ్వాలన్న కాంగ్రెస్ పిటిషన్‌పై సోమవారం ఉదయం విచారణ జరిగింది. ఇప్పటికే పేపర్ లీకేజీపై సిట్ నివేదికను సమర్పించింది. విచారణలో భాగంగా పిటిషనర్ తరుపున కాంగ్రెస్ సెల్ ఇంఛార్జి వివేక్ థన్కా వాదనలు వినిపించారు. అయితే ఈ పిటిషన్‌ను ఇంత హడావుడిగా విచారించాల్సిన అవసరం లేదని ఏజీ తెలిపారు. ఇంకా ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ రావాల్సి ఉందని, కేసు దర్యాప్తు సిట్ జరుపుతోందని.. విచారణ కొనసాగుతోందని వివరించారు. ఇప్పటికే సిట్ నివేదికను సమర్పించామని, అడిషనల్ నివేదిక సబ్మిట్ చేస్తామని చెప్పారు. ఇప్పటికిప్పుడు విచారణ అవసరం లేదని ఏజీ కోర్టుకు తెలియజేశారు. అయిత తమ వాదన వినాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. ఐదు సుప్రీం కోర్టు తీర్పులను వివేక్ థన్కా చదివి వినిపించారు. ఇరువురి వాదనలు విన్న కోర్టు విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది. ఈరోజు తీర్పు ఇస్తామని హైకోర్టు తెలియజేసింది.

# నల్లగొండలో రాజకీయ మంట

### వెంకట్‌రెడ్డి ప్రకటనతో ఆశావహుల్లో టెన్షన్



**నల్గొండ,ఏప్రిల్ 24 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా ఉంది. ఎవరుకూడా పార్టీ అధ్యక్షుడి మాటకు కట్టుబడి ఉండరు. ఎవరు కూడా పార్టీ ఆదేశాలను పాటించరు. ఎవరికి ఏది తోస్తే అదే మాట్లాడుతారు. హైకమాండ్ అంటారు..కమాండ్ మాత్రం వీరే ఇస్తారు. నల్గొండలో రంజాన్ సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడి పుట్టిస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆయన మరోసారి స్పష్టం చేయడం ప్రత్యర్థులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఇటీవల నల్గొండ నియోజకవర్గ కేంద్రంగా ఇటు బీఆర్ఎస్, అటు కాంగ్రెస్‌లో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో కోమటిరెడ్డి తను పోటీ చేసేదానిపై క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. చెరుకు సుధాకర్ ఎపిసోడ్ తర్వాత తన పొలిటికల్ కెరీర్ గురించి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేయడం రాజకీయవర్గాల్లో చర్చకు దారితీసింది. ఆయన ఈసారి పాలర్మెంటుకు బదులు అసెంబ్లీకి పోటీకి సిద్ధం అవుతున్నారని సంకేతాలు ఇచ్చారు. ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో తనకు తిరుగులేదనే విశ్వాసంతో ఉన్నారు. నల్గొండలో వెంకట్‌రెడ్డి కాకుండా వేరెవ్వరు పోటీ చేసినా తమకు ఢోకా ఉండదని కంచర్ల వర్గం ధీమా వ్యక్తం చేస్తోంది. మరోవైపు వెంకట్‌రెడ్డి కి బదులు నల్గొండ సీటును మైనార్టీలకు లేదంటే బీసీ లకు ఇస్తారని బీఆర్ఎస్, కాంగ్రెస్‌లోని ఆయన వ్యతిరేకవర్గం ప్రచారం చేయడం సంచలనం రేపింది. తన పైన జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే నల్గొండకు వచ్చిన ప్రతిసారీ వెంకట్‌రెడ్డి తాను ఇక్కడి నుంచే పోటీ చేస్తాననే స్పష్టత ఇస్తున్నారు. కానీ ఈసారి మాత్రం అందుకు భిన్నంగా వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. కాంగ్రెస్‌లో వెంకట్ రెడ్డి వర్గం..వెంకటరెడ్డి వ్యతిరేక వర్గాలు చురుకుగా పనిచేస్తున్నాయి. కోమటిరెడ్డిని దెబ్బకొట్టేందుకు మైనార్టీ అభ్యర్థి అంటూ వ్యతరేక వర్గం ప్రచారం చేస్తోంది. వెంకట్‌రెడ్డి నల్గొండ నుంచి పోటీ చేయపోతే తర్వాత చాన్స్ పార్టీ సీనియర్ నేత దుబ్బాక నర్సింహారెడ్డికి వస్తుందని ఆశించారు. బీసీలు లేదంటే మైనార్టీలకు ఇస్తారనే ప్రచారం కూడా జరిగింది. కానీ వెంకట్‌రెడ్డి అనూహ్యంగా ట్విస్ట్ ఇవ్వడంతో నల్గొండ నియోజకవర్గంలోని ఆశవాహుల్లో అలజడి మొదలైంది. నిన్నామొన్నటి వరకు నల్గొండ సీటు పైన ఆశపెట్టుకున్న వారికి రాజకీయంగా పెద్ద దుమారాన్నే లేపాయి. నల్గొండ పట్టణంలో మైనార్టీ ఓటర్లు కీలకం. టౌన్‌లో సుమారు 34 వేల మంది ఓటర్లు ఉండొచ్చని అంచనా. అధికార, ప్రతిపక్ష పార్టీల లీడర్లు మైనార్టీ ఓటర్లపై నమ్మకం పెట్టుకుని రాజకీయ వ్యూహం రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా వెంకటరెడ్డికి ఇన్నాళ్లు వెన్నుదన్నుగా నిలిచిన మైనార్టీలను తిరిగి తన వైపు తిప్పుకునేందుకు ఆయన ఏకంగా ఆ వర్గానికి ఎమ్మెల్సీ పదవి ఆఫర్ చేశారు.

# 56 శాతం ఉన్న బీసీల పట్ల కేంద్రం వివక్ష



### ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటులో నిర్లక్ష్యం

### నేటి ప్లీనరీ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి గంగుల

**కరీంనగర్, ఏప్రిల్ 24 (సమ సమాజం):** జనాభాలో 56 శాతం ఉన్న బీసీల పట్ల కేంద్రం వివక్ష చూపుతున్నదని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కేంద్రం తీరువల్ల బీసీలకు చాలా అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. బీసీల కోసం కేంద్రంలో ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 25న నిర్వహించనున్న బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ప్లీనరీ ఏర్పాట్లను కరీంనగర్‌లో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల కేంద్రం రూ.46 లక్షల కోట్లతో బడ్జెట్‌ప్రవేశపెడితే.. అందులో బీసీ సంక్షేమం కోసం కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు రూ.2 వేల కోట్లు దేనికి సరిపోతాయని ప్రశ్నించారు. బీసీలకోసం ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఉంటే కచ్చితంగా ఆ శాఖకు ఎక్కువగా నిధులు కేటాయించేవారని, తద్వారా బీసీలకు న్యాయం జరిగేదన్నారు. ÷శవ్యాప్తంగా బీసీ కులగణన చేయాలని కోరుతున్నప్పటికీ కేంద్రం నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. చట్ట సభల్లో రిజర్వేషన్ విషయంలోనూ అదే వివక్ష కొనసాగుతున్నదని చెప్పారు. వీటిన్నంటిపై మంగళవారం జరిగే బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ప్లీనరీలో తీర్మాణం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఈనెల 27న పార్టీ అవిర్భావాన్ని పురష్కరించుకొని రాష్ట్ర స్థాయిలో ప్లీనరీ ఏర్పాటుచేస్తుండగా ఈనెల 25న అన్ని నియోజకవర్గల్లో మినీ ప్లీనరీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ సమాజం కేసీఆర్‌ను (అఓ ఐఅభీ) మాత్రమే నాయకుడిగా గుర్తిస్తుందన్నారు. రాష్ట్ర సాధనకోసం నాడు ఉద్యమాలు చేసి.. నేడు అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తున్న కేసీఆర్‌కు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా స్థానం కల్పించారని తెలిపారు. ఎవరెన్ని అసత్య ఆరోపణలుచేసినా.. ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

# నేడు బిఆర్ఎస్ ప్లీనరీలు

### ప్రభుత్వ విజయాలను చర్చిస్తాం: స్పీకర్



కామారెడ్డి,ఏప్రిల్24(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంగళవారం ప్రతీ నియోజకవర్గంలో బిఆర్ఎస్ ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ప్లీనరీలతో తెలంగాణలో ప్రభుత్వ కార్యక్రమాలను చర్చిస్తామని అన్నారు. సోమవారం బాన్సువాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సమావేశంలో స్పీకర్ హోదాలో కాకుండా నియోజకవర్గ ఎమ్మెల్యే హోదాలో పాల్గొంటానన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చేందుకు కొన్ని పార్టీలు పేపర్లు లీక్ చేసి డ్రామా ఆడుతున్నాయని పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో మాదిరి అన్ని రాష్ట్రాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లను, రైతు బంధు, రైతు భీమా పథకాలను కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం ప్రభుత్వం కక్ష సాధింపు చర్యతో నేతలపై సీబీఐ, ఈడీ దాడులు చేయిస్తోందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ధైర్యవంతుడని, ఎవరికి భయపడే మనిషి కాదన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ఆధునీకరణ కొరకు 250 కోట్ల రూపాయలను కేటాయించామని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# ప్రేమోన్మాది ఘాతుకం

### యువతి గొంతుకోసం దుర్మార్గుడు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (సమ సమాజం): ప్రేమోన్మాదం మరోసారి పడగ విప్పింది. తన ప్రేమను నిరాకరించిం దన్న కోపంతో ఓ యువతి గొంతు కోశాడో ఓ యువకుడు. ఈ ఘటన బోరబండలోని బంజారానగర్ లో జరిగింది. కొంతకాలం నుంచి సురేష్ అనే వ్యక్తి ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే.. అతడి ప్రేమను ఆమె అంగీకరించలేదు. ఇది మనసులో పెట్టుకున్న సురేష్.. యువతి గొంతు కోశాడు. ఈ ఘటనలో బాధితులరాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అతడికి దేహశుద్ది చేశారు. ఇటు యువతిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలికి డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు. మరోవైపు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు.

# ఆర్టీసీలో ఎన్నికలు జరపండి: హైకోర్టు



**హైదరాబాద్, ఏప్రిల్ 24 (సమ సమాజం):** ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. గత మూడేళ్లుగా ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించలేదని హైకోర్టులో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ పిటిషన్ వేసింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఆర్టీసీలో యూనియన్ల గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఎన్నికలు నిర్వహించకపోవడంపై వివరణ ఇవ్వాలంటూ ఆర్టీసీ, ప్రభుత్వ అధికారులకు నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం కోర్టు ఆర్డర్స్‌ను తుంగలో తొక్కిందని ఆర్టీసీ యూనియన్ లీడర్ అశ్వద్ధామా రెడ్డి విమర్శించారు. ఏ ఎన్నికలు జరపడానికి సీఎం ఒప్పుకోరని.. ఏదో సాకుతో ఎన్నికలను ఆపుతారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కోర్టు ఆదేశాల మేరకు ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

# 26న నార్పలలో పర్యటించనున్న సిఎం జగన్


### జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో నగదు బదిలీ



**అమరావతి, ఏప్రిల్ 24 (సమ సమాజం):** సీఎం వైఎస్ జగన్ 26న బుధవారం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం నార్పల పర్యటించనున్నారు. జగనన్న వసతి దీవెన కార్యక్రమం లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. సీఎంఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10.20 గంటలకు నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకుంటారు. 10.40 – 12.35 గంటల వరకు నార్పల క్రాస్‌రోడ్స్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి ప్రసంగం, అనంతరం జగనన్న వసతి దీవెన కార్యక్రమం లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 1.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.50 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

# వడగళ్లతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన బండి

### రైతులకు అండగా ఉంటామని హామీ



**కరీంనగర్, ఏప్రిల్ 24 (సమ సమాజం):** పంటనష్టపోయిన రైతులకు అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. వారిని ఆదుకునే ప్రయత్నం చేస్తామని అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లాలో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ముందుగా కరీంనగర్ రూరల్ మండలం ఫకీర్ పేటలో వానకు దెబ్బతిన్న పంటలు పరిశీలించి.. రైతులకు ధైర్యం చెప్పారు బండి సంజయ్. రైతులంతా అధైర్య పడొద్దని.. బీజేపీ పార్టీ అండగా ఉండి ఆదుకుంటుందని తెలిపారు. తమకు జరిగిన నష్టాన్ని బండి సంజయ్ కు వివరిస్తూ రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్లే తమకు పంట నష్ట పరిహారం అందకుండా పోయిందని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఇక కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శనివారం, ఆదివారం కురిసిన వడగండ్ల వానకు 23,709 ఎకరాల్లో పంట నష్టం జరగగా 17,197 మంది రైతులు నష్టపోయినట్లు అగ్రికల్చర్ ఆఫీసర్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో 22,120 ఎకరాల్లో వరి, 334 ఎకరాల్లో మక్క, 1172 ఎకరాల్లో మామిడి, పుచ్చ, బొప్పాయి తోటలు, 83 ఎకరాల్లో కూరగాయల తోటలు ఉన్నట్లు గుర్తించారు. అత్యధికంగా చొప్పదండి మండలంలో 8176 ఎకరాల్లో పంట నష్టం జరగగా, 5,757 మంది రైతులు నష్టపోయినట్లు ఆఫీసర్లు తేల్చారు. హుజూరాబాద్ మండలంలో 3,871 ఎకరాల్లో పంట నష్టం జరగగా, 4,013 మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించారు.

# క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్

### 50వ పడిలో అడుగిడిన లిటిల్ మాస్టర్



**ముంబయి, ఏప్రిల్ 24 (సమ సమాజం):** భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులను సొంతం చేసుకున్న సచిన్ టెండూల్కర్ అంటే తెలియచని వారు ఉండరు. పిన్న వయసులోనే క్రికెట్లోకి అడుగు పెట్టిన సచిన్ ఎన్నో ఉన్నత శిఖారుల అధిరోహించాడు. ఈ నెల 24తో 50వ పడిలోకి ప్రవేశించాడు. క్రికెట్‌లో ఎన్నో మైలురాళ్లను అధిగమించి తన పేరుపై లెక్కలేనని రికార్డులు రాసుకున్న సచిన్ బర్త్ పుట్టిన రోజు అభిమానులకు చాలా ముఖ్యమైన రోజు. భారత క్రికెట్ చరిత్రలో సచిన్ లేకుండ పేజీ లేదు. సచిన్ పుట్టిన రోజు సందర్భంగా అతని గురించి అనేక ఆస్తకర విషయాల్లో కొన్ని ... ఫిబ్రవరి 1988లో సచిన్ టెండూల్కర్–వినోద్ కాంబ్లీ కలిసి 664 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. పోటీ క్రికెట్‌లో ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఆ మ్యాచ్‌లో సచిన్ 326 పరుగులతో అజేయంగా నిలిచాడు. నవంబరు 1989లో 16 ఏళ్ల వయసులో సచిన్ కరాచీలో పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. అయితే తరువాత ఏడాది అంటే ఆగస్టు 14, 1990లో ఓల్డ్ మాంచెస్టర్‌లో జరిగిన టెస్టులో సచిన్ తొలి సెంచరీ నమోదు చేశాడు. 1996 వన్డే ప్రపంచకప్‌లో 523 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 24 ఫిబ్రవరి 2010లో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో అజేయంగా 200 పరుగులు చేశాడు. దీంతో వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు.

# అకాల వర్షాలతో రైతులపై దెబ్బ

## భారీగా నష్టపోయిన రైతులు



పలు ప్రాంతాల్లో వరి, మామిడి పంటలకు నష్టం

ఆదుకోవాలంటునన రైతన్నలు

**హైదరాబాద్/విజయవాడ, ఏప్రిల్ 24 (సమ సమాజం):** తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాలు మరోసారి రైతులను నట్టేట ముంచాయి. చేతికొచ్చిన పంటను నేలపాలు చేశాయి. వడగండ్లు, ఈదురుగాలులతో కురిసిన వానలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కోతకొచ్చిన మక్క, వరి చేన్లు నేలకొరిగి పోగా.. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకున్న వడ్లు తడిసిపోయాయి. వాన నీటిలో కొట్టుకు పోయాయి. పక్వానికొచ్చిన మామిడి కాయలన్నీ రాలిపోయాయి. చేతికొచ్చిన పంట నీటిపాలు కావడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, సూర్యపేట్ జిల్లాలో రైతులు భారీగా నష్టపోయారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట అకాల వర్షాలకు ఆగమవుతుండడంతో లబోదిబోమని మొత్తుకుంటున్నారు రైతులు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతినడంతో జనగామ జిల్లాలో స్వయంగా పరిశీలించారు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల తో కలిసి వరి పొలాల్లోకి వెళ్లారు. రైతులతో మాట్లాడి, ప్రభుత్వం ఆదుకుంటుందంటూ భరోసా కల్పించారు.కరీంనగర్ జిల్లాలో కురిసిన రాళ్ల వాన, అకాల వర్షాలతో ఎన్నడూ లేని విదంగా పూర్తి పంట నష్టపోయిన ప్రాంతాల్లో మంత్రి గంగుల కమలాకర్ స్థానిక యంత్రాంగంతో క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిశీలించారు. రైతులలో భరోసా నింపారు. ప్రకృతి వైపరీత్యం చూపుతుందేమో కానీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిరంతరం రైతుల పక్షానే నిలబడుతుందని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. అటు ఏపీలోనూ అకాల వర్షం బీభత్సం సృష్టించింది. ఉభయగోదావరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో విరుచుకుపడింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అకాల వర్షం రైతులకు అపారనష్టాన్ని మిగిల్చింది. వేలాది ధాన్యం బస్తాలు నీటమునిగాయి. క్లళెదుటే ధాన్యం నీళ్లలో కొట్టుకుపోవడంతో కర్షకులు కన్నీటిపర్యంతమయ్యారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. పలు జిల్లాల్లో వాణిజ్య పంటలు నేలకొరిగాయి. రాష్ట్రంలోని పలు జిల్లాలో ఆదివారం కురిసిన వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. పిడుగులపాటుకు ఐదుగురు మృతి చెందారు. వీరిలో కృష్ణా జిల్లాకు చెందిన వారు ముగ్గురు, గుంటూరు జిల్లాకు చెందిన వారు ఇద్దరు ఉన్నారు. అకాల వర్షాలు, ఈదురుగాలులకు పంటలు దెబ్బతిన్నాయి. కళ్లాల్లో నిల్వ ఉంచిన వరి, మొక్కజన్న తడిచి పోయింది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంలో పిడుగుపాటుకు చాట్ల శ్యామ్‌బాబు (47), కొరివి కృపాదానం (52) మృతి చెందారు. పిడుగుపాటు శబ్దానికి గుండెపోటుకు గురై చల్లపల్లి మండలం రామాపురం క్లబ్ రోడ్డు ప్రాంతానికి చెందిన కె.నాంచారమ్మ (90), చల్లపల్లిలోని కమల్ థియేటర్ దగ్గర సైకిల్‌షాపు నిర్వహిస్తున్న మస్తాను (57) మృతి చెందారు. కోడూరు, మోపిదేవి, చల్లపల్లి ప్రాంతాల్లో పలుచోట్ల పిడుగుపాటుకు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. వర్షానికి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో పలుచోట్ల పొలాల్లోని ధాన్యం రాశులు తడిసిపోయాయి. కాకినాడ జిల్లా తాళ్లరేవులో సుమారు వంద ఎకరాల్లో వరి పనలు తడిచి ముద్దయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో దాళ్వా వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో కురిసిన వర్షానికి కళ్లాల్లోని ధాన్యం బస్తాలు తడిచిపోయాయి. ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ శాతం పడిపోవడంతో సాగుదారులు ఏరియేటర్లతో పంటను రక్షించుకునే ప్రయత్నం చేశారు.

# బిజెపి ఎజెండాలో ముస్లిం రిజర్వేషన్ల ఎత్తివేత



(మొదటి పేజి తరువాయి) కలిసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని అమిత్ షా ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఏం చేసినా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తోందని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలు తమ వైపే ఉన్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు ఈ సభ నిదర్శనమని చెప్పారు. రాష్ట్రంలో అవినీతి సర్కార్ నడుస్తోందని అమిత్ షా ఆరోపించారు. కేసీఆర్ సర్కార్ పనితీరును దేశం మొత్తం చూస్తోందని చెప్పారు. కేసీఆర్ కు ఏ ఒక్క బీజేపీ కార్యకర్త కూడా భయపడరని అమిత్ షా చెప్పారు. కేసీఆర్ ను గద్దెదించేవరకు బీజేపీ కార్యకర్తలు నిద్రపోరని అన్నారు. 35 లక్షల మంది నిరుద్యోగులను కేసీఆర్ రోడ్డుపైన పడేశారని అమిత్ షా అన్నారు. పేపర్ లీకేజీపై ఇంతవరకు కేసీఆర్ ఎందుకు మాట్లాడ టం లేదని ప్రశ్నించారు. పేపర్ లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపితే వాస్తవాలు బయటకు వస్తాయని అన్నారు. ఇకపోతే కర్నాకటలోనూ ముస్లిం రిజర్వేషన్ల తుట్టెను కదిపారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కర్ణాటకలో ముస్లింలకు ప్రత్యేక కోటాను కల్పించిందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ప్రత్యేక కోటా అందించడమంటే రాజకీయంగా లబ్ధి పొందడమేనని అన్నారు. కర్ణాటకలో ముస్లిం కోటా రద్దుపై వ్యాఖ్యానించారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌ను నిలిపివేసి, ఎస్‌సి, ఎస్‌టి, వొక్కలిగ, లింగాయత్‌లకు రిజర్వేషన్‌లను పెంచుతామని అన్నారు. ఈ ఏడాది మార్చి ప్రారంభంలో మైనారిటీకి కేటాయించిన నాలుగు శాతం కోటాను రద్దు చేసి, ఓట్ల బ్యాంకులైన వొక్కలిగ, లింగాయిత్‌లకు కేటాయించాలని బమ్మై ప్రభుత్వ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఒబిసి కేటగిరీ 2బి వర్గీకరణ కింద ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్‌ను రెండు సమాన భాగాలుగా విభజించింది. ఇప్పటికే కోటా ఉన్న వొక్కలిగ, లింగాయత్‌లకు అదనంగా జోడించేందుకు గతేడాది బెల్గావి అసెంబ్లీ సెషన్‌లో 2సి, 2డి అనే రెండు కొత్త రిజర్వేషన్ కేటగిరీలను సృష్టించింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మే 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారం చేపడితే ముస్లింల కోటాను పునరుద్ధరిస్తామని పేర్కొంది.

# అనధికారికంగా సైరన్ల వినియోగం

### ఇకపై కేసులు పెట్టి వాహనాల సీజ్

### కఠిన చర్యలు తీసుకోవాలని సిపి ఆనంద్ ఆదేశాలు




**హైదరాబాద్,ఏప్రిల్ 24 (సమ సమాజం):** అనధికారికంగా సైరన్లను వినియోగిస్తున్న వారిపై హైదరాబాద్ పోలీసులు చర్యలు ఇకపై తీసుకోనున్నారు. రూల్స్ బ్రేక్ చేసిన వారిపై కేసులు నమోదు చేయనున్నారు. కొంతమంది అనధికారికంగా తమ వాహనాలకు సైరన్లు వినియోగిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ .. చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి.. అనధికారికంగా సైరన్లు ఉన్న వాహనాలను సీజ్ చేయాలని కోరారు. ఎమర్జన్సీ సమయాల్లో ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా పోలీసుల వాహనాలకు, అంబులెన్స్‌లకు మాత్రమే సైరన్లు ఉంటాయి. ట్రాఫిక్‌లో సైరన్లు వీరు తప్ప మిగతా వాహనాల్లో వినియోగించటం చట్టవిరుద్ధం. అయితే.. కొంతమంది మాత్రం అధికారదర్పంతో అనధికారికంగా సైరన్లు వినియోగిస్తున్నారు. ట్రాఫిక్ నుంచి బయటపడేందుకు ప్రైవేటు వాహనాలకు కూడా సైరన్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. సైరన్లు ఎవరు పడితే వారు వినియోగించవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ... అవేవి పట్టించుకోవడం లేదు. తమ ప్రైవేటు వాహనాలకు సైరన్లను ఏర్పాటు చేసుకుని.. మిగతా ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ట్రాఫిక్ లో చిక్కుకొని ఇబ్బంది పడే వాహనదారులకు ఈ సైరన్ల గోల తలనొప్పి తెప్పిస్తున్నాయి. టోలిచౌకిలో రాత్రి పదిన్నర సమయంలో ఏపీ రిజిస్ట్రేషన్ ఉన్న ఇన్నోవా వాహనం సైరన్ తో హల్ చల్ చేసింది. దీన్ని వీడియో తీసిన ఓ వ్యక్తి ట్విట్టర్ లో షేర్ చేశారు. దీనిపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ స్పందించారు. చట్టవిరుద్ధంగా సైరన్ లను ఉపయోగించే వారిపై చర్యలు తీసుకోవాలని, వాహనాలను సీజ్ చేయాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. ఇలా చట్టవిరుద్ధంగా సైరన్‌లను ఉపయోగించడం వల్ల చాలా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ రోజు నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అనధికార సైరన్లు వాడే అన్ని వాహనాలను సీజ్ చేయాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులను కోరాను. రోగులు లేకపోయినా.. కొన్ని అంబులెన్సుల్లో సైరన్లు మోగిస్తున్నారు. అలా సైరన్లు మోగించే అంబులెన్స్‌లపై చర్యలు తీసుకుంటాం. చట్టవిరుద్ధమైన సైరన్‌లను ఉపయోగించే వాహనాలకు సంబంధించిన రుజువులతో ప్రజలు సమాచారం ఇస్తుండాలి' అని సీవీ ఆనంద్ ట్వీట్ చేశారు.

# గవర్నర్ కేసు .. సుప్రీంలో ముగింపు



(మొదటి పేజి తరువాయి) బిల్లులు పెండింగ్ లో లేవని గవర్నర్ తరపు లాయర్ కోర్టుకు తెలిపారు. రెండు బిల్లుల విషయంలో ప్రభుత్వం నుంచి క్లారిఫికేషన్ కోరినట్లు చెప్పారు. అయితే గవర్నర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారాపడాల్సిన పరిస్థితి ఉందని ప్రభుత్వ తరపు న్యాయవాది దుష్యంత్ దవే వాదించారు. పెండింగ్ బిల్లులను ఎక్కువ కాలం గవర్నర్ తన దగ్గరే పెట్టుకోవడం కరెక్ట్ కాదని కోర్టుకు తెలిపారు. మధ్యప్రదేశ్, గుజరాత్ వంటి రాష్టాల్లో బిల్లులు త్వరగా పరిష్కారం అవుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు ప్రభుత్వ తరపు న్యాయవాది దుష్యంత్ దవే . నిర్ణీత కాల వ్యవధిలో బిల్లులు ఆమోదించేలా ఆదేశాలివ్వాలంటూ తెలిపారు. ఇరు వర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ప్రస్తుతం బిల్లులు పెండింగ్ లో లేనందున కేసు విచారణను ముగిస్తున్నామని చెప్పింది.

# షర్మిల ఇంటి వద్ద ఉద్రిక్తత

(మొదటి పేజి తరువాయి) ఇవ్వాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల భావించారు. అందులో భాగంగా ఉదయం 10:30 గంటలకు లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయం నుంచి షర్మిల బయలుదేరుతుండగా పోలీసులు ఒక్కసారిగా పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. బయటకు వెళ్లేందుకు అనుమతిలేదని ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే షర్మిల పోలీసుల మాటలను బేఖాతరు చేశారు. అయినా పోలీసులు వినిపించుకోలేదు. ఒక పార్టీ అధ్యక్షురాలిపట్ల పోలీసుల తీరు సరిగా లేదని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా కానిస్టేబుళ్లను పెట్టలేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఆమెను తోసివేసే ప్రయత్నం చేయడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన షర్మిల రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తన తప్పులేకపోయినా పోలీసులు తనపై ప్రవర్తించిన తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విధుల్లో ఉన్న ఎస్ఐ, కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్నందుకు షర్మిలపై ఐపీసీ 330, 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా ఈ ఘటనపై వైఎస్సార్‌టీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఉదయం వైఎస్ఆర్టీపీ చీఫ్ వైఎస్ షర్మిలను అరెస్టు చేసిన పోలీసులు.. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఆమెను కలవడానికి షర్మిల తల్లి విజయమ్మ అక్కడికి చేరుకున్నారు. కానీ పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో.. విజయమ్మ పోలీస్ స్టేషన్ ఎదుటే నిరసన తెలుపుతున్నారు. అనంతరం పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తన బిడ్డను కలవడానికి కూడా ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని విజయమ్మ, పోలీసులను నిలదీశారు. అసలు తనను ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్‌లో ఉన్న కుమార్తెను పరామర్శిస్తే తప్పేంటనీ విజయమ్మ పోలీసులను ప్రశ్నించారు. శాంతియుతం గా నిరసన వ్యక్తం చేసే హక్కు కూడా తెలంగాణలో లేదా అంటూ ఆమె మండిపడ్డారు. ఈ క్రమంలో ఆమెతోపాటు భారీ సంఖ్యలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కార్యకర్తలు సైతం తరలివచ్చారు. అంతకుముందు వైఎస్ఆర్టీపీ అఫీసు ముందు ఆ పార్టీ చీఫ్ షర్మిలను పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులపై చేయి చేసుకున్నందుకు షర్మిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళా కారిస్టేబుల్ తో పాటుగా ఎస్ ఐ రవీందర్ పై షర్మిల చేయిచేసుకున్నారు. దీనిని సీరియస్ గా తీసుకున్న పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# పోలీసులపై షర్మిల దురుసు ప్రవర్తన

(మొదటి పేజి తరువాయి) షర్మిల సిట్ ఆఫీసుకు వెళ్తున్నారని..దాడిపై మరింత సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. షర్మిల సచివాలయంకు వెళ్తారని సమాచారం ఉందని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. అందుకే ముందస్తు అప్రమత్తమయ్యామన్నారు. ఎస్సై ఫిర్యాదు ఆధారంగా షర్మిల కేసులో ముందుకెళ్తామని సీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

# రాజధాని అమరావతి రద్దుకు కుట్ర

### ఇళ్ల స్థలాల పేరుతో విధ్వంస చర్యలు

### ఆర్-5 జోన్ పరిధి ప్రాంతాల్లో రైతుల ఆందోళన

**గుంటూరు, ఏప్రిల్ 24 (సమ సమాజం):** అమరావతి రాజధానికి రైతులు ఇచ్చిన భూముల్లో ఇళ్ల స్థలాలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విధ్వంసానికి కుట్ర పన్నిందని రాజధాని రైతులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ ప్రజాచైతన్య పాదయాత్రను ప్రారంభించారు. ఆర్-5 జోన్ పరిధి ప్రాంతాల్లో ఈ యాత్రను చేపట్టారు. మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో సోమవారం మంగళగిరి, తుళ్ళూరు మండలాల్లో రైతుల పాదయాత్ర కొనసాగింది. కృష్ణాయపాలెం, మందడం, ఐనవోలు, కురగల్లు మీదుగా నిడమర్రు వరకు ఈ యాత్ర ను నిర్వహించారు. అనంతరం నిడమర్రులో ముగింపు సభను నిర్వహించారు. యాత్ర ప్రారంభం సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తప్పుబట్టారు.

# మన రాతను మనమే మార్చుకుందాం

(మొదటి పేజి తరువాయి)




**శంభాజీనగర్, ఏప్రిల్ 24 (సమ సమాజం):** మార్పు కోసం కలసి పనిచేద్దామని..యువత నడుం బిగించి మన ప్రభుత్వాన్ని మనమే తెచ్చుకుందదామని బిఆర్ఎస్ అధినేత, సిఎం కెసిఆర్ పిలుపునిచ్చారు. ఈసారి రైతు ప్రభుత్వమే తెచ్చుకుందామని అన్నారు. మీ ఓటు ఒక్కసారి బిఆర్ఎస్‌కు వేసి..మీ అదృష్టాన్ని మీరే రాసుకోవచ్చాన్నారు. తెలంగాణ తరహా అభివృద్ది చేసి చూపుతానని అన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని ..మనచేతుల్లోనే మన భవిష్యత్ ఉందని..ఓటు బలమేమిటో చూపండని పిలుపునిచ్చారు. అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్ నినాదంతో ఇప్పటికే మహారాష్ట్రలో ప్రకంపనలు సృష్టిస్తున్న భారత రాష్ట్ర సమితి.. మరాత్వాడాలో మూడో బహిరంగసభ నిర్వహిస్తోంది. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఔరంగాబాద్ సభకు హాజరై ప్రసంగించారు. ఇప్పటికీ సాగు, తాగు నీరు అందడం లేదు. సాగు, తాగు నీరు అందకపోవడం ఎవరి పాపం? ఇప్పటికీ ప్రజలకు సాగు, తాగునీరు సరిగా అందట్లేదు. గోదావరి, కృష్ణా, పెన్ గంగా వంటి నదులు ఉన్నా మహారాష్ట్రకు నీటి కష్టాలెందుకు..? ముంబై దేశ ఆర్థిక రాజధాని, కానీ తాగేందుకు నీళ్లుండవా..? దేశం పురోగమిస్తుందా..? తిరోగమిస్తుందా..? ఆలోచించండి. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అయింది.. కానీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. మహారాష్ట్ర పవిత్ర భూమికి నమస్కారం. అందరికీ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు. మరాఠా భూమి ఎందరో మహానుభావులకు జన్మనిచ్చింది. బీఆర్ఎస్‌కు ఒక లక్ష్యం ఉంది. నా మాటలను విని ఇక్కడే మర్చిపోకండి. నా మాటలపై మీ గ్రామాలకు వెళ్లి చర్చ చేయండి. మీ ఇంటివాళ్లు, స్నేహితులతో చర్చించండి. ఈ దేశంలో ఏం జరుగు తుందో ఆలోచించండి. దేశం ఉండాల్సిన స్థితిలో ఉందా? లేదా? అనే అంశంపై చర్చ పెట్టండి. మహారాష్ట్ర వైతాళికులైన ఛత్రపతి శివాజీ మహారాజ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రీ భాయి పూలేతో పాటు పలువురు మహానీయులకు కేసీఆర్ పుష్పాంజలి ఘటించారు. సభా వేదికపై నుంచి మరాఠా ప్రజలకు సీఎం కేసీఆర్ అభివాదం చేశారు. ఔరంగాబాద్‌కు చెందిన నాయకులకు కూడా కేసీఆర్ అభివాదం చేశారు. కేసీఆర్ సమక్షంలో పలువురు నాయకులు.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్ అనే నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగిపోయింది. ఔరంగాబాద్ మాజీ ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఇంటికి సీఎం కేసీఆర్ చేరుకున్నారు. ఆయన నివాసం వద్ద కేసీఆర్‌కు అపూర్వ స్వాగతం లభించింది. విమానాశ్రయం నుంచి నేరుగా కైలాష్ పాటిల్ ఇంటికి చేరుకున్నారు. గతంలో వైజాపూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు అభయ్ పాటిల్. బేగంపేట నుంచి ప్రత్యేక విమానంలో ఔరంగాబాద్ బయల్దేరిన కేసీఆర్.. ఛత్రపతి శంభాజీ విమానాశ్రయానికి చేరుకున్నారు. మరికాసేపట్లో బీఆర్ఎస్ బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కేసీఆర్ వెంట ఎంపీలు కేశవరావు, రంజిత్ రెడ్డి, సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, కడియం శ్రీహరి, ఎమ్మెల్యే బాల్క సుమన్, జీవన్ రెడ్డిలు ఉన్నారు.

# భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే




(మొదటి పేజి తరువాయి) పరిశ్రమల కోసం ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఎలక్ట్రిక్ వెహికల్స్ తయారీకి తెలంగాణ అడ్డాగా మారాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. ఎలక్ట్రిక్ వెహికల్స్ తయారీకి సంబంధించిన అన్ని రకాల పార్ట్‌లు తయారయ్యే విధంగా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరిలో జరిగిన తెలంగాణ మొబిలిటీ వాలీ ద్వారా ఎలక్ట్రిక్ తయారీ పరిశ్రమల కోసం ఒప్పందాలు చేసుకున్నామని కేటీఆర్ గుర్తు చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీలో ఎలక్ట్రిక్ వెహికిల్ తయారీ యూనిట్‌కు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావుతో పాటు పలువురు నాయకులు, కంపెనీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మహీంద్రా అండ్ మహీంద్రా వారు తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రిక్ పాలసీ నచ్చి రూ. 1000 కోట్ల పెట్టుబడి జహీరాబాద్‌లో పెట్టడం సంతోషంగా ఉందన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమ స్థాపనకు కావాల్సిన అన్ని అనుమతులను 21 రోజుల్లో ఇస్తున్నామని తెలిపారు. టీఎస్ ఐపాస్ పాలసీ దేశానికి ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ వచ్చిన తర్వాత 23 వేల పరిశ్రమలు నెలకొల్పాము. మూడు లక్షల 30 వేల పెట్టుబడులు వచ్చాయి. 20లక్షల మందికి ఉపాధి అవకశాలు లభించాయని తెలిపారు. కొత్తగా వచ్చే కంపెనీలలో స్థానిక యువతకు పెద్దపీట వేసి ఉద్యోగాలు ఇస్తామన్నారు. జహీరాబాద్ ప్రాంతంలోని స్థానిక యువత కోసం ప్రభుత్వ పరంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాము. ఉద్యోగాలు రావాలంటే యువత స్కిల్ పెంచుకోవాలని కేటీఆర్ సూచించారు.

# కోహ్లీ అరుదైన రికార్డు

## ఐపిఎల్‌లో వంద క్యాచ్‌లు అందుకున్న ఘనత



బెంగళూరు,ఏప్రిల్24(సమ సమాజం): రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మాజీ సారథి విరాట్ కోహ్లీ అత్యంత అరుదైన ఘనత సాధించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఫీల్డర్‌గా వంద క్యాచ్‌లు అందుకున్న తొలి ఆర్సీబీ ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఓవరాల్‌గా ఆ ఘనత సాధించిన మూడో ఆటగాడు కోహ్లీనే. బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ ఈ రికార్డు అందుకున్నాడు. ఈ మ్యాచ్‌కు స్టాండిన్ కెప్టెన్‌గా వ్యవహరించిన కోహ్లీ గో÷-డలెన్ డక్ అయినప్పటికీ మైదానంలో మాత్రం మెరుపులా కదిలాడు. రెండు అద్భుతమైన క్యాచ్‌లు పట్టుకుని యువ సంచలనాలు యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్‌ను పెవిలియన్ పంపాడు. ఈ ఇద్దరు ఔటైన తర్వాతే బెంగళూరు విజయం ఖాయమైంది. ఈ రెండు క్యాచ్‌లతో కలిపి విరాట్ ఖాతాలో 101 క్యాచ్‌లు ఉన్నాయి. మొత్తం 228 మ్యాచుల్లో విరాట్ ఈ ఘనత సాధించాడు. ఆల్ రౌండర్ కీరన్ పొలార్డ్ 103, సురేశ్ రైనా 109 (204) క్యాచ్‌లతో కోహ్లీ కంటే ముందున్నారు. ఇక, ఈ సీజన్‌లో కోహ్లీ అద్భుతమైన ఫామ్‌తో ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు ఆడి 46.50 సగటుతో 279 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు అర్ధ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 82 (నాటౌట్) కాగా, స్ట్రయిక్ రేట్ 141.62.

# ఆకాశమే హద్దుగా చెలరేగిన రహానే


## కోల్‌కతాపై చెన్నై భారీ విజయం



కోల్‌కతా,ఏప్రిల్24(సమ సమాజం): కోల్‌కతాలో ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ పై చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ 49 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇప్పటివరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో ఐదింటిలో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. అజింక్య రహానే (29 బంతుల్లో 71 పరుగులు) సంచలన ఇన్నింగ్స్ ఆడి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును గెలుచుకున్నాడు. రహానే ఆకాశమే హద్దుగా చెలరేగి ఆరు ఫోర్లు, ఐదు సిక్సర్లు బాదాడు. రహానే ఇలాంటి బ్యాటింగ్ చేయడం ఈ సీజన్‌లో ఇదే తొలిసారి కాదు. ఈ సీజన్‌లో రహానే 5 మ్యాచ్‌లు ఆడి మొత్తం 209 పరుగులు చేశాడు. అతడి స్ట్రైక్ రేట్ దాదాపు 190 ఉండడం గమనార్హం. నిజానికి ఈ ఐపీఎల్‌లోరహానేను పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. చెన్నై టీమ్ ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ రహానేకు అవకాశం రాలేదు. ముంబైతో మ్యాచ్‌కు ముందు మొయిన్ అలీ గాయపడడంతో అతడి స్థానంలో రహానే టీమ్‌లో వచ్చాడు. అప్పట్నుంచి అతడు బ్యాట్‌తో చెలరేగు తున్నాడు. ఇంతలా ఆడి విజయాలు అందిస్తున్న రహానేకు ఈ సీజన్‌కు గాను దక్కే మొత్తమెంతో తెలిస్తే మాత్రం ఆశ్చర్యపోవడం ఖాయం.గతేడాది ఫామ్ కోల్పోయి బాగా తంటాలు పడిన రహానేను ఎవరూ పట్టించుకోలేదు. ఐపీఎల్ మినీ వేలంలో రహానే పట్ల ఏ ఫ్రాంఛైజీ ఆసక్తి చూపించలేదు. చెన్నై టీమ్ మాత్రమే అతడి బేస్ ధర రూ.50 లక్షలకు తీసుకోవడానికి ఆసక్తి చూపించింది. దాంతో నామమాత్రపు ధరకే చెన్నై టీమ్ అతడిని దక్కించుకుంది. అయితే అతడే చెన్నై టీమ్‌కు తురుపు ముక్కలా మారాడు. రహానేకు ఈ ఐపీఎల్‌లో దక్కేది కేవలం రూ.50 లక్షలే అయినప్పటికీ అతడి కమ్‌బ్యాక్‌కు మాత్రం ఉపయోగపడుతోంది. త్వరలో జరగనున్న డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో తలపడే టీమిండియా జట్టులో రహానేకు ప్లేస్ ఖాయంగా కనిపిస్తోంది.

# రాయల్ ఛాలెంజర్స్ మరో విజయం

## లక్ష్యఛేదనలో చతికిల పడ్డ రాజస్థాన్



బెంగళూరు,ఏప్రిల్24(సమ సమాజం): రాజస్థాన్ రాయల్స్‌తో సొంతగడ్డపై జరిగిన ఉత్కంఠ పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. బెంగళూరు నిర్దేశించిన 190 పరుగుల లక్ష్య ఛేదనలో బోల్తా పడిన రాజస్థాన్ 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు మాత్రమే చేయగలిగింది. దేవదత్ పడిక్కల్అర్ధ సెంచరీ (52)తో మెరిసినా, యశస్వి జైస్వాల్ 47 పరుగులు చేసినా చివర్లో బెంగళూరు బౌలర్ హర్షల్ పటేల్ విజృంభించి మూడు వికెట్లు తీయడంతో రాజస్థాన్ చేతులెత్తేయక తప్పలేదు. ధృవ్ జురెల్ 16 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 34 పరుగులు చేసి అజేయంగా నిలిచినప్పటికీ జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. ఇక, వెటరన్ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ క్రీజులో ఉన్న కొన్ని నిమిషాలు బెంగళూరును భయపెట్టాడు. ఆడింది ఆరు బంతులే అయినా రెండుఫోర్లు బాది రాజస్థాన్‌లో ఆశలు నింపాడు. అయితే, మరో భారీ షాట్‌కు యత్నించి ప్రభుదేశాయ్‌కు దొరికిపోయాడు. అతడు అవుట్ కావడంతో బెంగళూరు గెలుపు ఖాయమైంది. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన బెంగళూరుకు తొలి బంతికే షాక్ తగిలింది. బౌల్ట్ సంధించిన తొలి ఓవర్ తొలి బంతికే కోహ్లీ వికెట్ల ముందు దొరికిపోయి గో÷-డలెన్ డక్ అయ్యాడు. అయితే, ఇంపాక్ట్ ప్లేయర్‌గా క్రీజులోకి వచ్చిన డుప్లెసిస్, గ్లెగెన్ మ్యాక్స్‌వెల్ రాజస్థాన్ బౌలర్లపై తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. బౌలర్లను ఉతికి ఆరేశారు. డుప్లెసిస్ 39 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 62, మ్యాక్స్‌వెల్ 44 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 77 పరుగులు చేయడంతో స్కోరు బోర్డు పరుగులు తీసింది. అయితే, వారిద్దరూ అవుటైన తర్వాత వికెట్లు టపటపా రాలిపోయాయి. క్రీజులోకి వచ్చినవారు వచ్చినట్టే వెనుదిరగడంతో 200 దాటుతుందనుకున్న స్కోరు 189 పరుగులకే పరిమితమైంది. మ్యాక్స్‌వెల్, డుప్లెసిస్ తర్వాత దినేశ్ కార్తీక్ చేసిన 16 పరుగులే మూడో అత్యధికం. రాజస్థాన్ బౌలర్లలో బౌల్ట్, సందీశ్ శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

# సచిన్‌కు పలువురు ప్రముఖుల విషెస్



ముంబై, ఏప్రిల్24(సమ సమాజం): క్రికెట్ దిగ్గజం, వరల్డ్ వైడ్ గా కోట్లాది మంది ఆరాధ్య క్రికెటర్, భారత రత్న సచిన్ టెండూల్కర్ 50వ పడిలోకి అడుగుపెట్టాడు. క్రికెట్‌లో ఎన్నో రికార్డులు..రివార్డులు సాధించిన సచిన్ 50వ పుట్టిన రోజును జరుపుకుంటున్నాడు. అతనికి పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. 2013 నవంబర్ 16న వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 200మ్యాచ్‌ను ఆడిన సచిన్..సొంత మైదానం వాంఖడే స్టేడియంలో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అదే రోజు కేంద్ర ప్రభుత్వం సచిన్ టెండూల్కర్ కు భారత రత్న పురస్కారాన్ని ప్రకటించింది. ఆ తర్వాత 2014ఫిబ్రవరి 04న భారతరత్నను అందుకున్నాడు. క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి దాదాపు పదేళ్లు పూర్తి చేసుకున్న సచిన్ ఏప్రిల్ 24వ తేదీన 50వ పుట్టినరోజు జరుపుకుంటున్నాడు. దీంతో అభిమానులు, సహచర క్రికెటర్లు సచిన్ కు సోషల్ మీడియాలో బర్త్ డే విషెస్ చెబుతున్నారు..

# న్యాయం కోసం రోడ్డెక్కిన రెజ్లర్లు

## బ్రిజ్‌భూషణ్‌పై చర్యకు డిమాండ్


న్యూఢిల్లీ, ఏప్రిల్24(సమ సమాజం):భారత దేశ కీర్తి పతాకాన్ని అంతర్జాతీయ వేదికలపై రెపరెపలాడించిన రెజ్లర్లు న్యాయం కోసం రోడ్డెక్కారు. రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగికంగా వేధిస్తున్నా డంటూ ధర్నాకు దిగారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదంటూ ఆరోపించారు. అతనిపై చర్యలు తీసుకునే వరకు ఇంటికెళ్లేది లేదంటూ పుత్ పాత్ లపైనే పడుకుంటున్నారు. తమను లైంగికంగా వేధించిన రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు మరోసారి ధర్నాకు దిగారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో న్యాయం కోసం పోరాడుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని రెజ్లర్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఆరోపణలు చేస్తూ గతంలోనూ రెజ్లర్లు ధర్నా చేశారు. దీనిపై అప్పట్లో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. దీనిపై దర్యాప్తు ప్రారంభిస్తామని.. బాధితులకు న్యాయం చేస్తామని క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ హామీ కూడా ఇచ్చారు. ఈ ఆరోపణలపై విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీంతో రెజ్లర్లు శాంతించారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రెజ్లర్లు మరోసారి ధర్నాకు దిగారు. బ్రిజ్ భూషణ్ విషయంలో ప్రభుత్వ ప్యానెల్ రిపోర్టును బయపెట్టాలని రెజ్లర్లు డిమాండ్ చేస్తున్నారు. మహిళా రెజ్లర్ల నుంచి తీసుకున్న ప్యానెల్ రిపోర్టును వెల్లడించాలన్నారు. బ్రిజ్ భూషణ్‌పై ఫిర్యాదు చేసిన వారిలో ఒక మైనర్ కూడా ఉందని..ఆమె పేరు బయటకు రాకూడదన్నారు. బాధితులే స్వయంగా బయటికొచ్చి ఆరోపణలు చేసినా కేంద్రం చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ తీరు చికాకు తెప్పిస్తోందని రెజ్లర్ సాక్షి మాలిక్ అసహనం వ్యక్తం చేసింది. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్ భూషణ్ ను అరెస్ట్ చేయాలని..అప్పటి వరకు పోరాటం కొనసాగిస్తామని రెజ్లర్ భజరంగ్ పూనియా తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని రెజ్లర్ వినేశ్ ఫోగట్ ఆగ్రహం వ్యక్తం చేశారు.




# త్వరలోనే మళ్లీ పుష్ప-2 షూటింగ్

## సిగ్నల్ ఇచ్చిన దర్శకుడు సుకుమార్

ఐటి దాడుల వలన అల్లు అర్జున్ నటిస్తున్న 'పుష్ప 2' షూటింగ్‌కు బ్రేక్ పడింది. దీంతో ఇప్పుడు మళ్ళీ మే మొదటి వారంలో కానీ, రెండో వారం నుండి కానీ షూటింగ్ ఉండవచ్చు అని తెలిసింది. అలాగే ఇప్పుడు జరగబోయే షూటింగ్ కూడా మారేడుమిల్లిలో జరుగుతుందని, అక్కడికి యూనిట్ అంత వెళ్ళడానికి సమాయత్తం అవుతున్నారని కూడా తెలిసింది.కొన్ని రోజుల క్రితం దర్శకుడు సుకుమార్ ఇంటి మీద, అలాగే ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఆఫీస్ ల మీద ఆదాయపుపన్ను శాఖ అధికారులు దాడులు చేసి సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. సోమవారం దర్శకుడు సుకుమార్, 'పుష్ప 2' నిర్మాతలు అయిన మైత్రి మూవీస్ మేకర్స్ మీటింగ్ పెట్టుకొని 'పుష్ప 2' షూటింగ్ ఎప్పటి నుండి మొదలెట్టాలి అనే విషయం మీద చర్చించారని తెలిసింది. ఇంతకీ గత మూడు నాలుగు రోజుల నుండి ఐటి అహికారులు అన్నీ కూలంకషంగా పరిశీలించారని తెలిసింది. ఎందుకంటే మైత్రి మూవీ మేకర్స్ ఈమధ్య పెద్ద పెద్ద సినిమాలు నిర్మాణం చెయ్యడం, అలాగే అందులో చాలా సినిమాలు ఘన విజయం సాధించటంతో వారి ఆఫీస్‌ల మీద ఈ సోదాలు నిర్వహించారు. అలాగే సుకుమార్ కూడా ఈమధ్యన కొన్ని సినిమాలు నిర్మాణం చెయ్యడం, అగ్ర దర్శకుల్లో ఒకడు అయి, చాలా పెద్ద మొత్తంలో పారితోషికం తీసుకోవటం లాంటివి ఉండటం చేత, అతని ఇంటి మీద కూడా ఈ దాడులు నిర్వహించారు. ఇంతకీ ఐటి అధికారులకి ఏమైనా దొరికాయా అంటే, ఏమి దొరకలేదు అని అంటున్నారు. మైత్రి మూవీ మేకర్స్ లో సభ్యులు విదేశాల్లో చాలా కాలం వుండి ఇక్కడికి వచ్చారు, అలాగే విదేశాలకి ఎక్కువగా వెళుతూ వుంటారు కూడా. అందుకనే వాళ్ళ మీద దాడులు చేసి, పరిశీలించారు. కానీ, అందులో ఏమి దొరకలేదు అని తెలిసింది. అలాగే సుకుమార్ ఇంట్లో, ఆఫీస్ ల మీద కూడా చేసిన దాడిలో ఏమీ అనుమానాస్పదంగా లేవని పరిశీలనలో తేలినట్టు తెలిసింది.




# రాజమౌళితో తెలుగు సినిమాకు అంతర్జాతీయ ఖ్యాతి

## ప్రఖ్యాత దర్శకుడు మణిరత్నం వెల్లడి

'బాహుబలి' స్ఫూర్తితోనే 'పొన్నియిన్ సెల్వన్' ను తీసినట్లు ప్రముఖ దర్శకుడు మణిరత్నం చెప్పారు.



పొన్నియిన్ సెల్వన్-2'ప్రీ రిలీజ్ వేడుక వేదికగా దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళిని ప్రశంసల వర్షం కురిపించారు. భారతీయ చరిత్రను సినిమాలుగా మలిచేందుకు రాజమౌళి పెద్ద మార్గాన్ని వేశారని కొనియాడారు. హైదరాబాద్‌లో జరిగిన 'పొన్నియన్ సెల్వన్ -2' వేడుకలో ఆయన మాట్లాడుతూ 'ఇంతకు ముందు కూడా చాలాసార్లు చెప్పారు. ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. 'బాహుబలి' లేకపోతే 'పొన్నియిన్ సెల్వన్' లేదు. రాజమౌళి తన సినిమాను రెండు తన చిత్రాన్ని రెండు భాగాలుగా తీయకపోతే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేది కాదు. ఇదే విషయాన్ని నేను రాజమౌళిని కలిసినప్పుడు చెప్పాను. అతను వేసిన మార్గంలో మేమంతా వెళ్తున్నాం. రాజమౌళి మన సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కేలా చేశారు. ఆయన అలా చేయడం వల్లే ఇప్పుడు మేమంతా ప్యాన్ ఇండియా స్థాయి చిత్రాలు తీయడానికి ముందుకొచ్చాం. మా యూనిట్ సహకారం వల్లే ఈ ప్రాజెక్ట్ పూర్తయింది. ఆయన వల్లనే ఈ సినిమా చేయడం సాధ్యపడింది. రెండు భాగాలుగా తెరకెక్కించడానికి మాత్రం రాజమౌళి కారణం' అని అన్నారు. మా సినీ కెరీర్ పరంగా 'పొన్నియన్ సెల్వన్' మా అందరికీ గోల్డెన్ మూమెంట్. ఈ జర్నీలో ఎంతో నేర్చుకున్నాం. ఈ సినిమాతో దొరికిన స్నేహితులు నా లైఫ్ అంతా ట్రావెల్ అవుతారు. విక్రమ్‌గారిని చూసి ఎలా వర్క్ చేయాలనేది నేర్చుకున్నా. ఎంత అలసిపోయినా షాట్ రెడీ అంతే రెట్టింపు ఉత్సాహంతో వస్తారు. మణిరత్నం నా గురువుగారు. ఆయన ఆశీర్వాదంతో నా సినీ ప్రయాణం మొదలైంది. ఆయన సినిమాల గురించి నాకంటే తెలుగు ప్రేక్షకులకే బాగా తెలుసు. మణిరత్నం జీనియస్ డైరెక్టర్. ఆయనతో వంద సినిమాలైనా చేయాలనుంటుంది అని అన్నారు. మణిరత్నం దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన 'పొన్నియన్ సెల్వన్ 2' ఈనెల 28న విడుదల కానుంది. తెలుగులో దిల్ రాజు విడుదల చేస్తున్నారు. విక్రమ్, కార్తి, జయం రవి, ఐశ్వర్యారాయ్, త్రిష, ఐశ్వర్యలక్ష్మి, శోభితా ధూళిపాల, ప్రకాశ్‌రాజ్ కీలక పాత్రధారులు.

# లియో సినిమాతో విజయ్ బిజీ తరవాత గోపీచంద్‌తో మరో సినిమా




కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ ప్రస్తుతం స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న దళపతి 67తో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. లియో టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఇప్పుడు దళపతి 68 సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. ÷లుగు, తమిళ భాషల్లో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్ దళపతి 68ను తెరకెక్కించనుంది. విజయ్ హీరోగా నటించనున్న ఈ చిత్రం సూపర్ గుడ్ ఫిలిమ్స్ కు 100వది కావడం విశేషం. ఇప్పటివరకున్న టాక్ ప్రకారం స్టార్ డైరెక్టర్ అట్లీ ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నాడు.. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా మరోవైపు నటి మిషా ఘోషల్ అట్లీతో దిగిన సెల్ఫీని షేర్ చేస్తూ.. ధన్యవాదాలు అట్లీ సార్ అంటూ హ్యాష్ ట్యాగ్ జోడించింది. దీంతో దళపతి 68లో మిషా ఘోషల్ కూడా నటించబోతుందని తెలిసిపోతుంది. దళపతి 68కి సంబంధించి సూపర్ గుడ్ ఫిలిమ్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. లియోలో బాలీవుడ్ స్టార్ హీరో సంజయ్ దత్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నాడు. సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్ తెరకెక్కిస్తున్న ఈచిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ డైరెక్టర్. కాగా ఈ మూవీకి డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్, రత్నకుమార్, ధీరజ్ వైడీ సంభాషణలు అందిస్తున్నారు. మాస్టర్ సినిమా తర్వాత లోకేశ్-విజయ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో దళపతి 67పై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇకపోతే గత కొంతకాలంగా తెలుగు డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో విజయ్ సినిమా చేస్తాడంటూ వార్తలు వచ్చాయి. ఇప్పుడు అది కన్ఫామ్ అయ్యింది. వీరి కాంబినేషన్ లో సినిమా మరి కొంతకాలంలో సెట్స్ పైకి వెళ్లనుంది. లియో షూటింగ్ అయిపోయిన వెంటనే దీనిని మొదలుపెట్టే అవకాశం ఉంది. ఈ కొత్త సినిమాకి ఆర్బీ చౌదరి నిర్మాతగా వ్యవహరించనున్నారు. విజయ్ ఫ్యాన్స్ మెచ్చేలా ప్యూర్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో సెంటిమెంట్ తో ఈ సినిమా తెరకెక్కిస్తున్నారట. ఈ సినిమాలో విజయ్ డ్యూయల్ రోల్ లో కనిపించే అవకాశం ఉంది. ఈ లెక్కన హీరోయిన్లు కూడా ఇద్దరు ఉండే అవకాశం ఉంది. విజయ్ గతంలోనూ చాలా డ్యూయల్ రోల్స్ చేశారు. అవి కూడా సూపర్ హిట్ అయ్యాయి. అయితే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన మరో రెండు మూడు రోజుల్లోనే వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in